248) సాళంగనాట

ప॥ దిక్కులు సాధించబూని దేవదుందుభులు మ్రోయ । యెక్కువతో శ్రీవేంకటేశు డెక్కె దేరు ॥

చ॥ పన్నిద్దరుసూరియులబండికండ్లతేరు । సన్నుతి శేషాదిదేవాసనపు దేరు ।
కన్నులపండుగైనగరుడధ్వజపుదేరు । యెన్నగ శ్రీవేంకటేశు డెక్కె నిదె తేరు ॥

చ॥ మించునానామేఘముల కట్లతేరు । చుంచులనక్షత్రాలకుచ్చులతేరు ।
అంచెదేవతలే బొమ్మలై వుండినట్టితేరు । యెంచగ శ్రీవేంకటేశు డెక్కె నిదె తేరు ॥

చ॥ అట్టె కిందేడు లోకములంతరువులైనతేరు । నట్టనడుమను బ్రహ్మాండపుతేరు ।
దిట్టయలమేల్మంగతో దిరమైవుండేటితేరు । యిట్టె శ్రీవేంకటేశు డెక్కె నిదె తేరు ॥